రచన మాసపత్రిక 'మారుతోన్న కుటుంబ సంబంధాల'పై నిర్వహించిన

శ్రీ గాడేపల్లి వెంకటశాస్త్రి స్మారక

హాస్య వ్యంగ్య కథల పోటీలో బహుమతి పొందిన కథ.

# ఆత్మపదార్థం



"**యా**వత్ప్రపంచమూ మనదేశం వంక ఆశగా ఆరాధనగా చూస్తున్నాయి. ఎంచేతో తెలుసా?" ఆగి సభికులవంక చిరునగవుతో చూశాను.

అంతా ఉత్సుకతతో నా వంకే చూస్తున్నారు. హాలులో పిన్‌డ్రాప్ సైలెన్స్.

గర్వంగా తలపంకించి ఉపన్యాసం కొనసాగించాను "ఒకటి–మహోన్నతమైన మన కుటుంబవ్యవస్థ, రెండోది–ది అల్టిమేట్ అనదగ్గ మన వివాహ వ్యవస్థ......"

తప్పట్లు మార్మోగాయి.

ఆ హోరు తగ్గేవరకూ మందహాసం చేస్తూండిపోయాను. అదే సమయంలో ఇంకా ఇంకా తప్పట్లు కొట్టించుకోవాలన్న యావ నాలో అధికమయ్యింది.

"మీ మీ సంగతి తెలీదుగాని నేను మాత్రం స్వర్గంలోనే ఉన్నాను...."

సభలో కలకలం లేచింది.

కళ్ళజోడు సరిచేసుకుంటూ జనాన్ని చూస్తూ మళ్ళీ చిన్నగా నవ్వేను. ఆ నవ్వులో అధికుడ్నన్న భావన లేకపోలేదు.

"సైలెన్స్......నిశ్శబ్దంగా ఉండండి.....సత్యమూర్తిగారు చెప్పేది విందాం....." అధ్యక్షులవారు బల్ల చరిచి మైక్‌లో అరిచారు.

"మీరు విన్నది నిజమే. నేను స్వర్గంలోనే ఉంటున్నాను. అనురాగ జలధిలో ఈదుతున్నాను. అభిమాన జల్లుల్లో నిత్యం తడుస్తున్నాను. ఒకరికొకరం తోడై చేదోడై ఆనందామృతాన్ని కలిసి పంచుకుంటున్నాం. మాకు డాక్టర్ల నర్సుల డే కేర్ సెంటర్ల నౌకర్ల చాకర్ల అవసరం లేనే లేదు. అందరం అందరిపనీ చేస్తూ ఒకరికోసం పదిమంది నిలుస్తూ కలిసి ఉంటున్నాం. కలివిడిగా ఉంటున్నాం. అన్నీ అంతా కలబోసుకుని పంచుకుంటున్నాం.... మీకీ పాటికి అర్థమయ్యే ఉంటుంది. మాది ఉమ్మడి కుటుంబం.....!"

తప్పట్ల వర్షం ఆగకుండా అరగంట కురిసింది.

పిమ్మట మళ్ళీ గొంతు సవరించుకున్నాను "'క్షీణిస్తోన్న మానవ సంబంధాలు – పర్యవసానాలు' – గురించి ఏర్పాటు చేసిన ఈ చర్చా కార్యక్రమంలో పాల్గొన్న మీ అందరికీ విన్నవించేది ఒకటే. మా కుటుంబాన్ని ఆదర్శంగా తీసుకోండి. న్యూక్లియర్ కుటుంబాలకి స్వస్తి పలకండి. మనిషికీ మనిషికీ మధ్య ఉండేది ఆర్థిక సంబంధమే అన్న మార్క్స్ థియరీని తప్పని ఋజువు చేయండి. మన కుటుంబాలు అనురాగ దేవాలయాలని చాటి చెప్పండి. శలవ్...!"

చేతులు జోడించాను. మళ్ళీ జోరుగా తప్పట్లు.....!

విజేతలా గర్వాతిశయంతో సభికుల్ని చూసి వెనుదిరిగానో లేదో ఒకమ్మాయి స్టేజి మీదకి దూసుకొచ్చింది. "సత్యమూర్తిగారూ ఒక్క క్షణం.... మీది ఉమ్మడి కుటుంబమా?" అని ప్రశ్నించింది మెరుస్తోన్న కళ్ళతో.

"మీకేమైనా డౌటా?"

"లేదు లేదు. నేను టీవీ జర్నలిస్టుని. నా పేరు శృతి. మీరనుమతిస్తే మీ ఫ్యామిలీ మీద ఓ ప్రోగ్రాం చేస్తాం. మన కుటుంబ వ్యవస్థ గొప్పతనం ఏమిటో ప్రపంచానికి వివరిస్తాం. ప్లీజ్, పర్మిషన్ ఇవ్వరూ?"

గతుక్కుమన్నాను. ఆమె మాటలు మైకులో లాగినట్టున్నాయి అంతా నిశ్శబ్దమైపోయి నా వంకే గుడ్లప్పగించి చూస్తున్నారు. నా గొంతులో పచ్చి వెలక్కాయ అడ్డు పడింది. ఏం చెప్పాలో తోచక నీళ్ళు నములుతోంటే, "ఒప్పుకోండి సత్యమూర్తిగారూ. మీ కుటుంబాన్ని ఎందరో ఆదర్శంగా తీసుకుంటారు" అన్నారు అధ్యక్షులవారు.

బలవంతంగా నవ్వేను "సరే. అలాగే కానివ్వండి....."

"వచ్చే సండే రానా?" వెంటనే అక్కడే అడిగేసింది.

"ఒక ఫంక్షనుంది....." తడబడుతూ అన్నాను.

"వెరీ గుడ్. అదీ కవర్ చేస్తాం....."

"అహహ. ఇక్కడ కాదు హైదరాబాదులో....."

"ఆ నెక్స్ట్ సండే?"

"ఓకే"

మళ్ళీ తప్పట్లు మ్రోగాయి. ఈ సారి మాత్రం నా వెన్నులో వణకు తెప్పించాయి.

సన్నగా కంపిస్తూ అందర్నీ తప్పించుకుంటూ హాల్లోకెళ్ళి మా ఆవిడ ప్రక్కన ఉసూరుమంటూ కూలబడ్డాను.

"అంత పెద్ద అబద్ధం ఆడేశారేంటి?" అంది శ్రీమతి రుక్మిణి.

"ఏదో ఆవేశంలో... తప్పట్ల కోసం... ఇలాంటి ట్విస్ట్ ఎక్స్‌పెక్ట్ చెయ్యలేదు!"

"అసలు తప్పు మీది కాదు ఆ పిల్లది. సభ్యతా సంస్కారం లేకుండా స్టేజిమీద కొచ్చి మరీ అడిగేస్తుందా?!"

"అవునవును. ప్రైవేటుగా అడగాలిగాని బొత్తిగా పబ్లిక్‌లో ప్రశ్నించడం...అది సంస్కారం కానే కాదు" తేల్చి పారేశాను.

"ఇప్పుడేవిటి చెయ్యడం?"

"బుర్ర పని చెయ్యటం లేదు. కానీ..... ఏదోటి చెయ్యాలి. లేకపోతే ఈ మీడియా వాళ్ళు కల్లు తాగిన కోతులవుతారు. ఊళ్ళో తలెత్తుకోలేను. మా స్టూండెంట్సుకి తెలిస్తే నా పని మరీ ఘోరం అవుతుంది!" మొఖాన గంటుపెట్టుకుని హీన స్వరంతో అన్నాను. కళ్ళ నుండి రాబోతున్న కన్నీళ్ళని అణచుకోవడం మహాకష్టంగా ఉంది.

"మీరేదో లాంగ్ క్యాంప్‌లో వెళ్తున్నట్టు ఫోన్ చేసేద్దురు గాని....."

"ఆ మాటతో ఆ పిల్ల వదుల్తుందనుకోను..... కందిరీగ బాపతు....."

సభలో మరి కూర్చోలేక లేచాను.

నా వెనుకే వచ్చేసింది రుక్మిణి.

"నేలకి పోయేది నెత్తికి రాచుకున్నట్టు గొప్పలకు పోవడం ఎందుకూ ఇప్పుడు జుట్టు పీక్కోవడం ఎందుకూ!" కారు ఎక్కుతూ అంది.

నేను మాట్లాడలేదు. ఆ అమ్మాయిని బురిడీ కొట్టించే పథకం గురించి తీవ్రాతి తీవ్రంగా ఆలోచించసాగాను.

ఆలోచన తెగలేదుగాని ఎలావోలా సక్సెస్ చెయ్యగలిగితే మాత్రం బోల్డంత నేమూ ఫేమూ వచ్చి తీరతాయన్న నమ్మకం కలిగి పెరగసాగింది.

కీర్తికోసం కాస్తంత రిస్కు తీసుకుంటే తప్పేంటి?!

* * *

"రుక్మిణీ! గ్రేట్ ఐడియా వచ్చేసింది. దెబ్బకి సీన్ని మార్చేస్తుంది" నిద్రలేస్తూనే గట్టిగా అరిచి చెప్పాను.

పరుగెత్తుకొచ్చింది రుక్మిణి.

"వర్కవుట్ అవుద్దా?" ఆశగా అడిగింది.

"అవ్వక చస్తుందా. ఇంజినీరింగ్ కాలేజ్ ప్రొఫెసర్నా మజాకా!" గొప్పగా నవ్వేను.

"అలా నవ్వకండి నాకు భయమేస్తోంది"

"భయం వద్దు జయం మనదే...."

"జయం అక్కర్లేదు సజావుగా గడిచి గట్టెక్కితే చాలు"

"మన పక్కవాటాలోని వాళ్ళనీ మేడమీది రెండువాటాల వాళ్లనీ రెండు మూడ్రోజుల పాటు ఇల్లు ఖాళీ చేసి ఎక్కడికైనా వెళ్ళమంటాను...."

బుగ్గలు నొక్కుకుంటూ అంది "వెళ్తారా?"

"ఏదో వంకబెడతాన్లే. తర్వాత మా బాబాయిల్నీ వాళ్ళ పిల్లల్నీ తమ్ముళ్ళనీ వాళ్ళ పిల్లల్నీ మా అక్కల్నీ రమ్మని పిలుస్తాను. కనీసం ఎనిమిది కుటుంబాలైనా వచ్చి తీరతాయి. ఇక చూసుకో ఇంటినిండా జనమే జనం!"

"బాగానే ఉన్నట్టుంది గాని రెండు వారాల్లో ఇదంతా జరుగుద్దంటారా?"

"నిక్షేపంలానూ. ఒక్కొక్కరికీ ఒక్కోరకమైన మంత్రం వేసి రప్పిస్తానుగా"

"ఇదంతా నాటకమని అనుమానం వచ్చిందో మొదటికే మోసం వచ్చేస్తుంది"

"ప్రొఫెసర్ని – ఆ మాత్రం రక్తి కట్టించలేనా!" భుజాలెగరేస్తూ కించిత్తు గర్వంగా అన్నాను.

"మరి మన పిల్లల్ని కూడా తీసుకొస్తారా?"

పెదవి కొరుకుతూ ఆలోచనలో పడ్డాను.

పెద్దబ్బాయి ఇక్కడే హాస్టల్లో ఉండి ఇంటర్ చదువుతున్నాడు. చిన్నవాడు గుడివాడ

స్కూల్లో ఫోర్త్ క్లాస్ చదువుతున్నాడు. మేధావులుగా 'చెక్కుతారని' వాళ్ళిద్దర్నీ ఖర్చుకు వెనకాడకుండా చిన్నప్పట్నుంచీ హాస్టల్లో ఉంచి చదివిస్తున్నాం. వాళ్ళెలాగైనా ఐఐటియన్లు అయి, ఆ తర్వాత అమెరికా సిటిజన్లుగా సెటిలవ్వాలన్నది మా ఉమ్మడి డ్రీమ్!

"పెర్సనల్‌గా వెళ్ళి రిక్వెస్ట్ చెయ్యాలి. అప్పుడుగాని పంపరు. ఒకరోజు భాగ్యానికి... అనవసరమేమో అన్పిస్తోంది.....!"

"ఆదివారమే కదా. చిన్నాని చూసి రెండు నెలలైపోయిందండీ!" రుక్మిణి స్వరం జీరబోయింది.

"ఓకే...ఓకే... తీసుకొస్తాన్లే. ముందు మనింట్లో అద్దెకున్నవాళ్ళని కలిసి కార్యక్రమానికి శ్రీకారం చుడతాను"

కాఫీ త్రాగి మేడమీదికెళ్ళి రెండు పోర్షన్లలోనూ అద్దెకుంటున్న వాళ్ళని సమావేశ పరిచాను.

"కమింగ్ సండేగాక ఆపై సండే అంటే నాలుగో తారీఖున మా ఇంట్లో ఫంక్షనుంది. మా బ్రదర్సూ కజిన్సూ అంతా కలిసి ఓ పాతిక మంది వస్తారు. ఓ మూడ్రోజులపాటు మీరంతా ఇల్లు ఖాళీ చేసి ఎక్కడికైనా వెళ్ళాలి....."

ఇద్దరూ ఇబ్బందిగా చూశారు.

"మూడ్రోజులు చాలు. ఏదైనా ప్రోగ్రాం పెట్టుకోండి లేదా మీ అత్తవారిళ్ళ కెళ్ళండి. ఈ సారికి తప్పదు. ఇల్లంతా వాడతాం గనుక ముఖ్యమైనవి ముందే జాగ్రత్త చేసుకోండి"

"ఏం ఫంక్షన్ సార్....."

"అదీ.....మరీ.....చాలా ఇంపార్టెంట్..... మా నాన్నగారి ఆబ్దికం. పదవది. చాలా గ్రాండ్‌గా చేస్తున్నాం....."

"మీరు మీ నాన్నగారికి తద్దినాలు పెడుతూంటారా? ఎప్పుడూ చూళ్ళేదే! "

గుటకలు మింగాను. కించిత్తు కోపంగా చూస్తూ "ఇక్కడ కుదరదని మా తమ్ముడింట్లో చేస్తున్నాంలే" అన్నాను.

వీళ్ళ పిచ్చిగానీ ఈ రోజుల్లో ఆ తతంగాలెవడిక్కావాలీ! తద్దినాలు పెడుతూ కూర్చునేంత తీరికెవరికుందీ!

పిల్లల పరీక్షలంటూ ఆడవాళ్ళు అడ్డుపడబోయారు.

"మా ఇంట్లోనే ఉండాలను కుంటే ఎడ్జస్టవ్వక తప్పదు" అని పాశుపతాస్త్రం ప్రయోగించేసరికి కాళ్ళబేరానికొచ్చేశారు.

'అలాగలాగే సార్' అనేశారు కోరస్‌గా.

క్రింది పోర్షన్ వాళ్ళనీ ఒప్పించేసరికి నా భుజాలు రెండంగుళాలు పెరిగాయి.

"మొదటి అంకం జయప్రదం అయ్యిందోయ్" రుక్మిణితో అన్నాను.

"జయప్రద వస్తోందా?" చటుక్కున అడిగింది.

"అబ్బెబ్బే..... ఫస్ట్ యాక్ట్ సక్సెస్ అంటున్నాను... ఇక మా బాబాయిల్నీ మా అక్కల్నీ తమ్ముళ్ళనీ ఒప్పించి రప్పించాలి"

"ఇంకాలస్యం ఎందుకూ ఫోన్ అందుకోండి"

"వాళ్ళ నెంబర్లు ఎక్కడున్నాయో..... టెలిఫోన్ నెంబర్ల డైరీ ఎక్కడుందో కాస్త వెదుకు"

"మీ సెల్‌లో వారి నెంబర్లు సేవ్ చేసుకోమంటే వాళ్ళతో నాకవసరం ఏవిటీ అన్నారు. ఇప్పుడొచ్చిందా లేదా!"

"ఇలాంటి పిడుగు నా నెత్తిమీద పడుతుందనుకోలేదు మరి"

"చేసుకున్న వారికి చేసుకున్నంత అన్నారందుకే" నవ్వుతూ టెలిఫోన్ డైరీ తెచ్చిచ్చింది.

మా నాన్నా వాళ్ళూ ముగ్గురన్నదమ్ములు. నాన్నే పెద్ద. ఆయన పోయి పదేళ్ళయ్యింది. బాబాయిల్లో ఒకరు హైదరాబాదులోనూ, రెండోవారు వైజాగ్‌లోనూ జాబ్స్ చేస్తున్నారు. వారి పిల్లలూ ఎక్కడెక్కడో సెటిలయ్యారు.

నాకు ఇద్దరక్కలూ, ఇద్దరు తమ్ముళ్ళూ. ఒక తమ్ముడు ఇక్కడే విజయవాడలోనే గవర్నమెంట్ జాబ్ చేస్తున్నాడు. రెండోవాడు గుంటూర్లో వ్యాపారం చేస్తున్నాడు. పెద్దక్కది ఆకివీడు ప్రక్కన పల్లెటూరు. చిన్నక్కా వాళ్ళూ సికిందరాబాదులో ఉంటున్నారు.

మా నాన్న వారసత్వం నాదే గనుక అందర్నీ కూడగట్టి ప్రోగ్రాం సక్సెస్ చెయ్యడం నాకు నల్లేరు మీద బండి నడకే.

పెదబాబాయి బాపినీడు నాటకాలేస్తూంటాడు. సినిమాల్లో నటించాలనే సిటీకి ట్రాన్స్‌ఫర్ చేయించుకునెళ్ళాడు. కాళ్ళరిగేలా స్టూడియోల చుట్టూ డైరెక్టర్ల చుట్టూ తిరిగేట్టగాని ఎక్స్ట్రా వేషాలు తప్ప గుర్తించగలిగే పాత్రలేవీ దొరకలేదు.

మన కుటుంబం మీద సినిమా తీస్తున్నారనీ నువ్వే కుటుంబ పెద్ద పాత్ర పోషించాలనీ చెప్పేసరికి ఎగిరి గంతేశాడు. కొడుకునీ కోడల్నీ మనవల్నీ తీసుకుని ముందే వచ్చేస్తానని ప్రామిస్ చేశాడు.

"రెండు ఫ్యామిలీలు కన్ఫర్మ్‌డ్" అంటూ చిన్న బాబాయి రాజారావుకి ఫోన్ చేశాను. ఆయన స్టీల్ ప్లాంట్‌లో పెద్ద హొదాలో ఉన్నారు. సుపీరియారిటీ కాంప్లెక్స్ జాస్తి.

"ఎవరూ? నువ్వట్రా..... నేను గుర్తొచ్చానేవిటి సంగతి? వైజాగ్‌లో ప్లాట్లేమైనా కొంటున్నావా? నీకేంరా ఎన్నైనా కొంటావ్. అత్తవారి ఆస్తి బాగా కలిసిందిగా!"

ఇబ్బందిగా ఫీలవుతూ అన్నాను "వచ్చే నెల నాలుగో తారీఖున మన వాళ్ళందర్నీ పిలిచి గెట్ టుగెదర్ అరేంజ్ చేశాను. మీరూ, రాహులూ, రాహుల్ భార్యా పిల్లల్తో సహా అంతా తప్పకుండా రావాలి బాబాయ్ "

"రాకపోకలకి ఎంత ఖర్చువ్వుద్దో తెలుసా?"

"మనం ఏ పండక్కీ పబ్బానికీ ప్రత్యేకంగా కలుసుకోలేదు. ఇప్పుడు అందరం కలిసి సరదాగా స్పెండ్ చేద్దాం బాబాయ్"

"ఆ సరదా ఖరీదు దగ్గర దగ్గర పదివేలు"

"పోనీ కనకదుర్గ అమ్మ వారి దర్శనానికొచ్చాననుకోండి...."

"స్పెషల్ దర్శనానికి అరేంజ్‌మెంట్లు చేస్తావా?"

"మీ(రావాలి గాని ఎందుకు చెయ్యను?"

"మీ పిన్ని ఎప్పుడో మొక్కుకుందిలే. వస్తాంలే అయితే. ఇంకెవరెవరు వస్తున్నారేంటి?"

"పెద బాబాయి, మా అక్కలూ తమ్ముళ్ళూ...."

"మా అన్నయ్య వస్తే నేను రాను"

"అదేవిటి బాబాయ్....."

"మా అమ్మ ఆఖరి రోజుల్లో ఆవిడ్ని బుట్టలో వేసుకుని కాసుల పేరు కొట్టేశాడు. వాడంత దుర్మార్గుడు ఈ భూమ్మీదుండడు"

" ఆ గొడవ మర్చిపోయి ఈ సారికి రండి బాబాయ్........"

"చూస్తాన్లే"

ఉస్సురంటూ నిట్టూర్చాను 'ఈయనింక మారడు' అనుకుంటూ.

ఊళ్లోనే ఉద్యోగం చేస్తున్న ఆఖరి తమ్ముడు కృష్ణకి ఫోన్ చేసి చెప్పేను.

"ఎప్పుడూ పండగలకే రమ్మనవు, ఇప్పుడు అర్థాంతరంగా ఈ పిలుపేంటి అన్నయ్యా. హఠాత్తుగా నా మీదింత ప్రేమ పుట్టుకొచ్చేసిందంటే నమ్మలేకపోతున్నాను"

ఒళ్ళు మండింది. అవసరం నాది గనుక నిగ్రహించుకున్నాను.

"వచ్చాక నీకే తెలుస్తుందిలే. బాబాయిలూ వస్తున్నారు....."

"నిజవాఁ ? అయినవాళ్ళమీద ఈ ప్రేమలెప్పట్నుంచి?"

"నీకేం చెయ్యనట్టు మాట్లాడతావేంటి? నీ చదువుకెంత సాయపడ్డాను?"

"నాన్న సొమ్మేగా!"

"అందుకే మీ వదిన  మీ తమ్ముళ్ళకు విశ్వాసాలుండవని ఎప్పుడూ దెప్పుతూంటుంది!"

"నేను మీ ఇంట్లో ఉన్నప్పుడు నన్ను పనివాడిగానే కదా చూసిందీ! నాన్న చనిపోయినందునే కదా నాకీ దుస్థితి అని అమ్మ కూడా బాధపడేది"

"అబ్బో! అక్కడికి నీకు ఉద్యోగం రాగానే నిన్నింతవాడ్ని చేశామన్న కృతజ్ఞతతో నాకూ మీ వదినకీ పట్టుబట్టలు పెట్టేసినట్లు మాట్లాడతావేంటి!"

"నేన్నిజంగా కొనితెచ్చినా మీకు నచ్చుతాయేంటి. పనివాళ్ళకి పెట్టేట్టున్నాయని విసిరి పారేస్తారు"

"తవ్వుకుంటూ పోతే చాలా కంకాళాలూ, కుండపెంకులూ బయటపడతాయిగాని

ఇంతకీ మీరొస్తారా రారా? అంతా వస్తున్నారు మరి. అందర్తో కలుస్తావో, ఉలిపికట్టెలా వేరే దారి పడతావో నువ్వే ఆలోచించుకో" విసురుగా లైన్ కట్ చేశాను.

"ఎవరితోనండీ కోపంగా మాట్లాడుతున్నారూ" రుక్మిణి అడిగింది.

"ఇంకెవడు మా కృష్ణే. వాడివన్నీ వంకరబుద్ధులూ వంకర కూతలూనూ!"

"కూతవేటు దూరంలో ఉంటున్నాడు. ఏం చేస్తున్నారంటూ ఏనాడైనా గుమ్మంలోకి తొంగి చూశాడా! ఎన్నడైనా ఒక పండో స్వీటో తెచ్చాడా! అన్నా వదినా అన్న ఇదే లేదా మనిషికి!"

"ఎదురు ఏమంటున్నాడో తెలుసా! ఒక్క పండక్కీ వాళ్ళని రమ్మని పిలవలేదట. మతిలేక ఆ సభలో ఏదేదో వాగినందునగానీ లేకపోతే వీళ్ళనీ వాళ్ళనీ ఎవడు పిలుస్తాడు?!"

"బాగా చెప్పేరు. ఇప్పుడైనా నా మాటవిని అర్జంటుగా ఏదో ఊరెళ్ళాల్సొచ్చిందని చెప్పి తప్పించుకోండి"

"అందరికీ చెప్పేక ఇప్పుడు డ్రాప్ అయితే బావుండదే. అదీగాక ఇది నన్ను లైమ్ లైట్లోకి తీసుకెళ్తుందే. అవాళ సభలోని వాళ్ళంతా నా వంక ఎలా చూశారో నువ్వు చూశావుగా!" అంటూ మళ్ళీ ఫోన్ అందుకున్నాను.

"ఇంకెవరు మిగిలారేంటి"

"రాముడూ, మా అక్కలూ.....అక్కలు రాకపోయినా ఫర్లేదనుకో. జనం కన్పిస్తారనంతే...."

"కృష్ణ కన్నా రాముడు నాలుగాకులెక్కువ చదివాడు. ఏవంటాడో మీ చెవుల్తో మీరే వినండి...."

రాముడు లైన్లోకి రాగానే అన్నాను "నువ్వూ మా మరదలూ నాలుగో తారీఖున ఇక్కడుండేలా రావాలిరా"

"ఇప్పుడేం పని? నాకు కుదర్దు. నీలా నాది ఉద్యోగం కాదు వ్యాపారం. ఎప్పుడు బడితే అప్పుడు సెలవు పెట్టడం కుదర్దు" నిర్మొహమాటంగా అన్నాడు.

"నాన్న గన్నవరంలో ఎప్పుడోకొన్న సైట్ ఆచూకీ తెలిసింది. కృష్ణ వస్తున్నాడు. నువ్వూ వస్తే ఏం చేయాలో ఎలా చేయాలో ఆలోచించి అది చెయ్యొచ్చు......"

"అరె అలాగా. అయితే ఒక రోజు ముందే వచ్చేస్తానన్నయ్యా" అర్జంటుగా ప్లేటు ఫిరాయించేశాడు!

"మరదల్ని కూడా తీసుకురా" అనింకోసారి చెప్పి రిసీవర్ పెట్టేస్తోంటే, "ఆ సైట్ ఎక్కడుందో తెలిసిందా?" ఆశగా అడిగింది రుక్మిణి.

"లేదు. పొలాల్లో ఎక్కడో ఉండుంటుంది. గట్టి సర్వేయర్ దొరికితే గాని ఆ ప్లాట్ ఆచూకీ పట్టలేం"

"మరలా చెప్పేరేం ?"

"అలా చెబితేగాని రాడు. వాడివన్నీ రూపాయల లెక్కలే"

"అక్కడికి మీవి కానట్టు!" నవ్వింది.

"డబ్బెవరికి చేదు?"

"నాకు తెలీదు బాబూ"

"పైకందరూ పత్తిత్తు కబుర్లు చెబుదారుగాని డబ్బూ దస్కం ఆస్తీ పాస్తీ ఎంత వీలైతే అంత నొక్కేయాలనే, నొల్లేసుకోవాలనే చూస్తారంతా. అందుకే మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలే అన్నాడు మార్క్స్ మహాశయుడు"

ఉలిక్కిపడ్డాను.

సభలో చెప్పిందానికి భిన్నంగా మాట్లాడుతున్నానేంటి ?!

మనస్సు చేదుగా అయ్యింది.

"వంటయితే వడ్డించు" అన్నాను లేస్తూ.

"అంతా వచ్చాక అసలు సంగతి తెలిశాక అడ్డం తిరుగుతారేమో కాస్త ఆలోచించండి. మీ వాళ్ళని అస్సలు నమ్మకూడదు!"

"కెమేరా ముందంతా పెద్ద మనుషులైపోతారు. మహానటులై పోటీ పడి నటిస్తారు చూడు"

"ఇంతకీ మీ అక్కలేమన్నారు? చీర సారె పెడతానంటే వస్తానన్నారా?"

"మరిచే పోయాను" అంటూ ఇద్దరక్కలకీ చేశాను.

చిన్నక్క షటిల్లో రిజర్వేషన్ దొరికితే వస్తానంది. పెద్దక్క మహదానందపడిపోయి, "పిలిస్తే పుట్టింటికి రాకుండా ఎలా ఉంటాన్రా. మీ బావ వద్దన్నా సరే రెక్కలు కట్టుకుని వచ్చి వాల్తాను" అంది.

హ్యాపీగా ఫీలయ్యాను. పెద్దక్క వస్తే చాలు వంటా వార్పూ తనే చూసుకుంటుంది. రుక్మిణి నలిగి పోనక్కర్లేదు!

* * *

"షూటింగుకి రేపొస్తున్నాం సత్యమూర్తిగారూ" పదోసారి చెప్పిందా అమ్మాయి శృతి.

"వెల్కం. మీరెప్పుడొస్తారా అని ఎదురు చూస్తున్నాను" అన్నానన్న మాటేగాని నాకు చాలా టెన్షన్‌గా ఉంది.

మా వాళ్ళంతా నా పరువూ మర్యాదా నిలుపుతారో లేక నిలువులోతు గొయ్యి తీసి పాతేస్తారో!

అందరికీ ఒకటికి రెండుసార్లు ఫోన్లు చేశాను.

ఆ పిలుపుని కూడా అపార్థం చేసుకుని "నీకేదో కలిసిరాకపోతే ఇన్నిసార్లు చెయ్యవు"

అని రాముడంటే, “నువ్వేదో పెద్ద ప్లాను వేసుంటావులే” అన్నాడు బాబాయి రాజారావు

పొరబాటున నోరు జారినందుకే కదా ఈ మాటలన్నీ! పోనీ జారాడే అనుకో ఆ పిల్ల గబుక్కున ఆ ముక్క ఎందుకు పట్టుకోవాలి? పట్టుకుందే అనుకో తనెందుకు అంగీకరించాలి? అంగీకరించాడే అనుకో అద్దె నటుల్తోనో అరువు నటుల్తోనో కార్యం చక్కబెట్టెయ్యక ఈ సహజ నటుల్నెందుకు పిలవాలి? పిలిచాడుపో రక్త సంబంధం దృష్ట్యా అయినా మారుమాట్లాడకుండా వచ్చి ప్రోగ్రాం విజయవంతం చెయ్యొచ్చుగా !

ఏవిటో! ఇది నాకెలాంటి కీర్తినీ, మరెలాంటి అనుభవాన్నీ మిగులుస్తుందో అంతు బట్టడం లేదు!

బాపినీడు బాబాయి, పిన్ని, వారబ్బాయి విశ్వం, మనవలు పొద్దుటే ట్రెయిన్‌కి దిగారు.

“ఈ వంకతోనైనా మనం కలుసుకుంటున్నందుకు చాలా సంతోషంగా ఉందిరా” అంటూ నా భుజం తట్టి అభినందించాడు. “ప్రతి దసరా ఉత్సవాలకీ రమ్మని పిలిచేవాడు మీ నాన్న. వచ్చేవరకూ ఊరుకునేవాడు కాదనుకో” అనీ అన్నాడు.

పదింటికి రాజారావు బాబాయీ పిన్నీ, రాహుల్ అతడి భార్యా వచ్చారు.

‘హమ్మయ్య’ అని నిట్టూర్చాను. చిన్నక్క రాలేదుగాని పెద్దక్క నాలుగు రకాల పిండివంటల్తో కొబ్బరికాయల్తో దిగిపోయింది. వాత్సల్యాభిమానాలతో ముంచెత్తింది.

అయిదింటికి కృష్ణ కుటుంబం, ఎనిమిదింటికి రాముడూ అతడి భార్యా వచ్చారు.

భోజనాలయ్యాక మగాళ్ళందర్నీ హాల్లో సమావేశపరిచి విషయమంతా చెప్పాను. మనం కలసికట్టుగా ఉండి ఈ ప్రోగ్రాం సక్సెస్ చెయ్యాలని కోరాను. ఇది మన కుటుంబ కాదు కాదు వంశ ప్రతిష్ఠల సమస్యంటూ కలరింగిచ్చాను.

“సైటు గొడవ అని పిలిచి ఈ పితకలాటేంటి?” కోపంగా అన్నాడు తమ్ముడు రాముడు.

“మా పెద్దన్నయ్య ఎప్పుడూ ఇంతే. తిరకాసు మనిషి” కృష్ణ అక్కసుగా అన్నాడు.

బాపినీడు బాబాయి సర్ది చెప్పాలని చూశాడు గాని రాముడు వెనక్కి తగ్గలేదు సరికదా రెచ్చిపోయాడు.

“మా అన్నయ్య సంగతి మీకు తెలీదు బాబాయ్. ఆస్తి పంపకాల్లో నాకూ తమ్ముడికీ చాలా అన్యాయం చేశాడు. నాన్న ఆసుపత్రి ఖర్చనీ చేబదుళ్లు చేశాడనీ అదనీ ఇదనీ చెప్పి చాలా సొమ్ము లాగేసుకున్నాడు” ఫిర్యాదు చేశాడు రాముడు.

“నేను ఖర్చు పెట్టాను. తీసుకున్నాను. తప్పేంటి?” గట్టిగానే జవాబిచ్చాను.

“ఎంత ఖర్చు పెట్టి ఎంత రాశావో ఎవరికి తెలీదూ! మా నాన్న పోయాక నన్ను ఇంటి పనోడి కన్నా హీనంగా చూశారు బాబాయ్” పెద్ద గొంతుతో అన్నాడు కృష్ణ.

ఏం జరిగిందేంజరిగిందంటూ లోపల్నుంచొచ్చారు ఆడవాళ్ళు.

"నలుగురూ కలిసినందుకు పండగ జేసుకోక ఈ కేకలూ కోపాలూ ఏవిట్రా. కుటుంబమన్నాక ఏవో తేడా పాడాలుంటాయి. సర్దుకుపోవాలి గాని వీధిన పడతారా ఎవరైనా! హవ్వ సిగ్గు!" అంది పెద్దక్క.

వాళ్ళకేదో సర్దిచెప్పి పంపించాడు పెద బాబాయి.

"ప్రతి ఇంటా ఏవో లోటు పాట్లుంటాయి. వాటిని బూతద్దంలో చూడకూడదు. మన అన్నే కదా, మన తమ్ముడే కదా అని సరిపెట్టుకోవాలి. కడుపు చించుకుంటే కాళ్ళ మీద పడుతుంది. జరిగింది మర్చిపోయి జరగాల్సిందాని గురించి ఆలోచించండి"

"నీతో బాటు మమ్మల్నీ తెయ్‌మంటూ యాక్ట్ చెయ్యమంటావ్" నిరసనగా అన్నాడు రాజారావు బాబాయి.

"ఒకరంటే ఒకరికెంత ప్రేమాభిమానాలున్నాయో బయటపెట్టుకుందాంరా"

"నా నోట్లో ఆడుతున్న మాటని కరక్టుగా బయట పెట్టావు బాబాయ్" అభినందన పూర్వకంగా చూస్తూ అన్నాను.

"నాకీ వేషాలూ నాటకాలూ పడవ్. రేప్పొద్దుటే వెళ్ళిపోతాను" అని రాముడు లేచి వెళ్ళిపోతోంటే ఆపి వెనక్కి తీసుకొచ్చి కూర్చోబెట్టాడు బాబాయి బాపినీడు.

"నాకూ నచ్చట్లేదు. ఉమ్మడిగా ఉండటమంటే ఇంట్లోని వాళ్ళతో కలిసి సహజీవనం చెయ్యడం. అది మన వల్ల అవుతుందా! ఎందుకొచ్చిన నాటకాలివి!" చప్పరించాడు రాజారావు బాబాయి.

నీరుగారిపోయాను. నీవే దిక్కంటూ కళ్ళతోనే వేడుకుంటూ సాయమర్థిస్తూ పెద బాబాయి వంక చూశాను.

"అలా తీసిపారెయ్యకురా! ఉమ్మడి కుటుంబాల విలువ మనకీ తెలిసొస్తుంది. అందరం ఒక్కటన్న భావన మనల్ని మరింత దగ్గర చేస్తుంది. మన తాత టైంలో అరమరికల్లేకుండా ఎంత చక్కగా కలిసి ఉండేవారో తలచుకుంటే ముచ్చటేస్తుంది. మన తాతకి నలుగురబ్బాయిలు. ఇద్దరు వ్యవసాయం చేసేవారు. ఇద్దరు ఊరూరా తిరిగి పొగాకు, బెల్లం అమ్మేవారు. సంపాదనంతా తెచ్చి తాత చేతిలో పోసేవారు. అన్ని ఖర్చులూ ఆయనే చేసేవారు. అందరి అసవరాలూ తీర్చేవారు. అందరి పెళ్లిళ్ళూ గొప్పగా చేశారు. కోడళ్ళు నలుగురికీ వడ్డాణాలు పెట్టేరని ఆ రోజుల్లో ఎంతో గొప్పగా చెప్పుకునే వారంటే నమ్ము. తలచెడిన మా మేనత్తా ఇంట్లోనే ఉండేది. ఆవిడ కొడుక్కీ కూతురికీ కూడా అదే లెవెల్లో పెళ్లిళ్ళు చేశారు. నిజంగా అవి గోల్డెన్ డేస్" అన్నాడు బాపినీడు.

"బ్లాక్ అండ్ వైట్ చిత్రాల్ని కలర్లో చూస్తే అలాగే గొప్పగా అన్పిస్తుంది. ఓ ఇరవై ఏళ్ళు పోయాక మన గురించీ అలాగే ఆహా ఓహో అని చెప్పుకుంటారు" రాజారావు

వ్యాఖ్యానించాడు.

"రేపు టీవీ వాళ్ళకి మేం ఏం చెప్పాలో చెప్పండి" అంటూ బాపినీడు బాబాయిగారి పిన్ని కమల ఆధ్వర్యంలో ఆడవాళ్ళంతా మా దగ్గరికొచ్చారు.

"వాళ్ళతో వీళ్ళతో నేనేం మాట్లాడలేను. వంట గది వదలిరాను నన్ను ఇబ్బంది పెట్టకండి" అంది పెద్దక్క.

"అంతా కలిసి ఒకే కుటుంబంగా ఉంటే ఎలా ఉంటామో అలా ఉండాలి. ఎలా మసుల్తామో అలా మసలాలి. వంటా వార్పూ పిల్లల సంరక్షణా వృద్ధుల ఆదరణా అన్నీ అంతా అందరి బాధ్యతగా ఉమ్మడి పనులుగా భావించాలి. లేదా కొందరు కొన్ని రకాల బాధ్యతలు నెరవేరుస్తున్నట్టు చెప్పాలి. ఏది ఏమైనా బయటివారికి మనమంతా కలిసి కట్టుగా ఆనందంగా ఉన్నామన్న అభిప్రాయం కల్గించాలి"

"అయితే మేమంతా ఒక మాటనుకుని దానికి కట్టుబడి పోతాం. పదండక్కా" అంది రాజారావు బాబాయిగారి పిన్ని పద్మ.

గుండెల మీంచి పెద్ద బరువు దిగిపోయినట్టన్పించింది.

నిశ్శబ్దంగా నిట్టూర్చాను.

* * *

ఉదయం ఎనిమిదింటికే శృతి బృందం వచ్చేసింది.

లోపలికి రమ్మన్నా రాకుండా ఇంటినీ పరిసరాలనీ షూట్ చెయ్యసాగారు.

ఇరుగు పొరుగు బయటికొచ్చి మరీ ఆసక్తిగా చూస్తున్నారు. వారినీ ఇంటర్వ్యూ చేస్తారేమో అనుకునేసరికి ముచ్చెమటలు పోశాయి. 'ఈ గండం గడిచేట్లు చూడు తల్లీ' అని కనకదుర్గమ్మకి మొక్కాను.

మేమంతా లాల్చీ పైజమాలు ధరించి ఎంచక్కా తయారయ్యాం. ఆడవాళ్ళంతా పట్టుచీరలు కట్టుకున్నారు. మేం రెండు వరుసలుగా నిలబడి మరీ సంప్రదాయ బద్ధంగా ఆహ్వానించాం.

అందర్నీ పరిచయం చేస్తూ నాలుగు ముక్కలు ఎక్కువే చెప్పాను. ఉమ్మడికి వెన్నూ దన్నూ స్ఫూర్తీ వారేనన్నాను.

దాంతో వారూ సంబరపడ్డారు.

డైనింగ్ టేబుల్ మీద శృతీ వాళ్ళకి టిఫిన్ అరేంజ్ చేశారు ఆడవాళ్ళు.

"ఇంత చిన్నగా ఉందేవిటి? అందరూ ఒక్కచోట తినరా?" ఆశ్చర్యబోయింది శృతి.

గుటకలు మింగుతూ మిత్రి చూశాను.

కమల పిన్ని "ఒక్కొక్కరివీ ఒక్కో టైమింగ్స్ మరి. అంచేత ఎవరి గదుల్లో వాళ్ళు

విడివిడిగా తింటాం" అని కవర్ చెయ్యాలని చూసింది.

"అప్పుడు హొటల్ గదుల్లో ఉన్నట్టుంటుంది గదా. అంతా కలిసి భోంచెయ్యడం లోనే ఒక ప్రత్యేకత, ఒక కలిసికట్టుదనం, ఒక ఆప్యాయత అన్నీ ఉంటాయి. మీరెప్పుడూ కలిసి భోంచెయ్యరా?"

"ఆదివారాలు చేస్తాం" ఠకీమని చెప్పింది రుక్మిణి.

"ఎక్కడ తింటారు?"

"ఈ హాల్లోనే నేలమీద కూర్చుని తింటాం. అలాగే తినాలంటారు మా కమలత్తయ్య"

రుక్మిణి మాటలకు కమల పిన్ని మురిసిపోయింది. పద్మ పిన్ని మూతి విరిచింది.

"బావుంది. వంట పనెవరు చేస్తారు?"

"మేమే. మంచీ చెడూ చెప్పుకుంటూ తలో పనీ చేసుకుంటాం"

"పనిమనిషి అవసరం లేదనుకుంటాను....." అని శృతి అందో లేదో "ఇయాల ఇంట్లో ఏటవుతాంది" అంటూ రంగ ప్రవేశం చేసింది పనిమనిషి సుబ్బు.

ఆమెనీ పరిచయం చేశారు.

"ఇక్కడెన్నాళ్ళనుంచి చేస్తున్నావ్? ఈ ఒక్క ఇల్లే చేస్తున్నావా లేక.....!" అడిగింది శృతి.

"ఒక్కింట్లో అయితే నాకెట్టా గడుసుద్దీ! నాలుగు నోళ్లు తినాల. పక్కింట్లో, పై వాటాల్లో మొత్తం అయిదిళ్ళలో చేస్తన్నా. తప్పుకోండమ్మా ఆలీసం అయిపోద్ది" అంటూ కొంగు బిగించి వంటింట్లోకి నడిచింది.

"మీరు మా గురించి మీ పనుల్నాపి కూర్చోవద్దు. మీ మీ పనులు చేసుకోండి. మీకు ఇబ్బంది కలక్కుండా ఒక్కొక్కర్తో మాట్లాడుతూ కవర్ చేసుకుంటాం" అంది శృతి.

అందరం అయిష్టంగానే అన్ని వైపులకూ సర్దుకున్నాం.

ఏం చేయాలో తోచక న్యూస్‌పేపర్ అందుకున్నాను. చెవులు మాత్రం శృతికి అప్పగించా.

మొదటంతా బాగానే... కాదు కాదు... అబ్బురపడేలా చెప్పారు. స్క్రిప్టు ప్రకారం నటించినట్టుగా ఉన్నారు. తర్వాత్తర్వాత 'మేము – మా కుటుంబం' అన్న ధోరణిలో కెళ్ళిపోయారు.

తామేం చేశారో, చేస్తున్నారో, పిల్లల్నెలా పెంచారో, వాళ్ళెలా వృద్ధిలోకొచ్చారో ఏకరువు పెట్టారు రాజారావూ కమలా పద్మా. బాపినీడు బాబాయి వారి మాటల మధ్య లింకు తెగిపోకుండా అపార్థాలకి తావివ్వకుండా సర్దిచెప్పాడు.

"మేము, మా పిల్లలు – అంటూ రెండు తరాలకే నేటి కుటుంబాలు పరిమితమై పోతున్నాయి. అలాటిది పూర్వం ఉమ్మడి కుటుంబాలెలా విజయవంత మయ్యాయంటారు?"

పెదబాబాయిని అడిగింది శృతి.

"మా తాతా, మా నాన్నా వాళ్ళ అన్నదమ్ములూ కలిసుండటం నా చిన్నప్పుడు చూశాను. అప్పట్లో ఒకరంటే ఒకరికి ఆపేక్షలూ అభిమానాలూ ఉండేవి. సహకారం సౌభ్రాతృత్వం ఉండేది. 'నేను' గాక 'మేం' రాజ్యమేలేది. కుటుంబ పరువు, కుటుంబ క్షేమం, కుటుంబ ఉన్నతి అని ప్రాకులాడేవారు. అందులోనే తమ బాగు, తమ శ్రేయస్సు ఉన్నాయని విశ్వసించేవారు." పెదబాబాయి చెబుతోంటే నేను ముళ్ళమీద కూర్చున్నాను.

"ఇప్పుడవి సాధ్యం కాదంటారా?"

"కానే కాదు. ఆ రోజులు వేరు ఆ మనుషులు వేరు! ఉద్యోగాలంటూ ఊళ్ళు పట్టుకుపోవడం ఒక కారణమైతే మనుషుల్లో స్వార్థం వెర్రి తలలు వేయడం మరో కారణం. స్వబాగు స్వీయ ఉన్నతి అన్న తాపత్రయమే గాని ఉమ్మడి భావన లేదు. ఇవాళ రేపు ఇతరుల శ్రేయస్సునెవరూ కాంక్షించడం లేదు. అసలు ఒకరి పొడే ఒకరికి గిట్టడం లేదు!" పెదవి విరిచారు.

"కలిసి ఉండకపోయినా కనీసం కలివిడిగా ఉంటూ... సహకరించుకుంటూ... అంతా బావుండాలనుకుంటూ సఖ్యంగా ఉండొచ్చు కదా"

"ఉండొచ్చు. కాని ఉండరు. అహంకారాలు, ధనాపేక్ష, మితిమీరిన స్వార్థం, అసూయ, ద్వేషం మనిషిని దిగజారుస్తున్నాయి. అటు వృద్ధ తరాన్ని నిర్లక్ష్యం చేస్తారు ఇటు బాల తరాన్నీ పట్టించుకోరు. కేవలం తమ భౌతిక సుఖాలే ముఖ్యమనుకుంటూ ఎండమావుల వెంట పరుగెడుతున్నారు"

"నిష్ఠుర సత్యాలని విడమర్చి చెప్పారు. థాంక్స్" అంది శృతి.

బాపినీడు బాబాయి భుజాలు తడుముకుంటూ నావంక చూశాడు.

మీడియాని వాచ్‌డాగ్స్ అని ఇందుకే అంటారేమో. మనకి తెలీకుండానే మనమేంటో గ్రహించేస్తారు. లోపలి సంగతులు కక్కించేస్తారు!

నేను భయపడినట్లే రాముడు, కృష్ణ నా మీద వ్యంగ్య బాణాలు వదిలారు. నాకసలు 'కుటుంబ స్పిరిట్' లేదనీ స్వార్థపు మనిషిననీ తేల్చేశారు.

వాటినెలా తిప్పికొట్టి నా ప్రెస్టేజ్ నిలుపుకోవడమా అని ఆలోచిస్తూ అవకాశం కోసం ఎదురు చూస్తున్నాను.

శృతి మా పిల్లల్తోనూ మాట్లాడింది. వారు ఎవర్తోనూ కలవకుండా విడిగా ఉంటూం డటం చూసి విస్తుబోయింది.

"అమ్మా నాన్నలతో కలిసి ఉంటే ఎంతో బావుంటుంది కదా" అనగా, "హాస్టల్‌కెళ్ళి పోతాం" అన్నారు. ప్రమాన్పడిపోయింది. నుదురు చిట్లించి నా వంక చూసింది.

"హాస్టల్లో ఉండి చదువుకుంటున్నారు. ఇంటితో కన్నా హాస్టల్‌తోనే ఎటాచ్‌మెంట్

ఎక్కువ ” వెర్రిగా నవ్వుతూ చెప్పేను.

“మీ కుటుంబంలో మీ పాత్ర గురించి చెప్పండి” నా మీదకు ప్రశ్నను సంధించింది.

కాలర్ ఎగరెయ్యలేదుగాని ఎగరేసినట్టుగా ఫోజుకొట్టాను. అసలే మైకు వీరుడ్ని. క్లాసులో కాలేజీలో సభల్లో సమావేశాల్లో చర్చల్లో – ఆఖరికి ఫంక్షన్లలో సైతం చొచ్చుకుపోవడం ఎలావోలా మైకు చేజిక్కించుకుని హీన పక్షం అరగంట మాట్లాడేసెయ్యడం నా హాబీ. ఇక ఇప్పుడు వీడియో సాక్షిగా మైకు దొరికితే విజృంభించకుండా ఎలా ఉండగలను?

“పెద్ద కొడుకు పెద్ద పాలేరుతో సమానమని వినే ఉంటారు.....”

“ఎస్సెస్”

“దానికి ప్రత్యక్ష ఉదాహరణ నేనే. మా ఫాదర్ చనిపోయాక ఇంటి బాధ్యతంతా నా నెత్తిన వేసుకున్నాను. ఏమాటకామాట చెప్పుకోవాలి. నా భార్య రుక్మిణి కూడా బాగా సహకరించిందిలెండి. ఫాదర్ వైద్యం నిమిత్తం చేసిన అప్పులు తీర్చాను. తమ్ముళ్ళిద్దర్నీ చదివించాను. ఒకడికి చదువబ్బకపోతే బిజినెస్ స్టార్ట్ చేయించాను. వాళ్లు స్థిరపడేలా శ్రద్ధ తీసుకున్నాను. వాళ్ళకి పెళ్లిళ్ళు చేసి ఒకింటి వాళ్ళను చేశాను. నా గురించి నేను చెప్పుకోకూడదు గాని, ఒక గాడ్ ఫాదర్లా వారి ఉన్నతికి బాటలు వేశానంటే నమ్మండి....”

“చాలా సంతోషం. చిన్న డౌట్. మీది ఉమ్మడి కుటుంబం అని చెప్పారు. మీ బాబాయిలూ మీతోనే ఉన్నారు. వాళ్ళెవరూ మీ తమ్ముళ్ళకు అండగా నిలబడలేదా?”

కంగు తిన్నాను.

“అహహ సపోర్టు రాలేదని కాదు వచ్చారు. ఎవరైనా కొంతవరకే రాగలరు కదా. నా తమ్ముళ్ళు గనుక నా మీదెక్కువ బరువు పడుతుంది. ఎక్కువ బాధ్యతగా ఫీలవుతూ ఎక్కువ శ్రద్ధ చూపాల్సొస్తుంది. అదీగాక అందరికన్నా ఎక్కువ చదివిన వాడ్ని. ఇంజినీరింగు చేశానని మా వాళ్ళు మీకు చేప్పే ఉంటారు. అంచేత అన్ని విషయాల్లోనూ నేను లీడ్ తీసుకుంటూ ఉంటాను...”

“ఒరే తమ్ముడూ. నీకిష్టమని వంకాయ శిలగడదుంప కూర చేస్తానంటే పద్మ పిన్ని ఒప్పుకోవటంలేదు. మొఖం వికారంగా పెడుతోంది” అంటూ వచ్చింది పెద్దక్క.

“అందరికీ నచ్చేది వండక్కా....” విసుగు కన్పించకుండా అన్నాను.

“అయితే బంగాళా దుంప కుర్మా చేసి, పప్పుచారు కాస్తాను. కొబ్బరి పచ్చడి ఎలాగూ ఉంది. నాలుగు వంకాయలు కోసి చింతపండు పులుసుపోసి వేపుడు కూడా చేసేస్తాను.....” అంటూ హడావిడిగా వెళ్ళిపోయింది.

ఎంబ్రాస్సింగా ఫీలయ్యాను. కూరల విషయంలో నాక్కొన్ని ఇష్టాలూ అయిష్టాలూ ఉన్న మాట నిజమే. కానవన్నీ చర్చించే సమయం ఇది కాదు కదా. ఆ మాత్రం గ్రహించలేదు

పెద్దక్క. ఎంతైనా పల్లెటూరి బగ్గిరాయే!

"విశ్వం భార్య హైదరాబాదులో ఉందిట కదా" అడిగింది శృతి.

"ఇద్దరూ అక్కడే ఉద్యోగాలు చేస్తున్నారు. వాటిని వదలి ఇక్కడే ఉండిపొమ్మనలేం కదండీ"

"పాయింటే! ఇదివరకట్లో అంతా ఒకే ఊళ్ళో పనీపాటా చేసుకునే వారు గనుక ఉమ్మడి కుటుంబాలు వర్ధిల్లేవి. ఇప్పుడెలా కుదురుద్దీ. భిన్నత్వంలో ఏకత్వంలా కొద్దో గొప్పో మీరంతా కలిసుండటం బాగానే ఉంది. అవునూ వైజాగ్‌లో ఉంటోన్న రాహుల్ భార్య అత్తమావల్నుంచి విడిపోయి వేరే కాపురం పెట్టాలంటోందేవిటి. అత్తమావలూ అక్కడే ఉంటున్నారుగా!"

"అదీ......మరీ......ఇమడలేని తనం. పదిమంది కలిసున్నప్పుడు కొన్ని ఎడ్జస్ట్‌మెంట్లు తప్పవ్. స్వేచ్ఛ తగ్గే మాటా నిజమే. అలా అని బాధ్యతల్ని కాదనుకుని, బంధాలను తెంచుకుని దూరంగా వెళ్ళిపోతాననడం సమర్థనీయం కాదు" గంభీరంగా చెప్పాను.

"మాకు ఒక్కడే అబ్బాయి. మా అబ్బాయీ కోడలూ మాతోనే ఉండాలని మాకు ఆశగా ఉండదా? మమ్మల్ని వదిలి వేరు కాపురం పెడతానంటోందా మహాతల్లి. దాని అర్థం తల్లీ కొడుకుల్ని విడదీయటమేకదా!" కయ్‌మంది పద్మ పిన్ని.

"మన కోరికలు, స్వతంత్రం, ఆశయాలు-అన్నీ ఒక పరిధికి లోబడి ఉండాలి. లేకపోతే కుటుంబాలు విచ్ఛిన్నమవుతాయి" గంభీర వదనంతో అన్నారు రాజారావు బాబాయి.

"రకరకాల మనుషులు, రకరకాల అభిప్రాయాలు, రకరకాల ప్రవర్తనలు – అయినా అంతా ఒకే రూఫ్ క్రింద ఉండాలనుకోవడం సమంజసమేనంటారా?"

శృతి నన్ను సూటిగా ప్రశ్నించేసరికి దిమ్మెరబోయి చూశాను. మెదడు బ్లాంక్ అయ్యింది. ఇదేదో బూమరాంగ్ తరహాలా ఉందని కలవరపడ్డాను.

జారిపోయిన ధైర్యాన్ని మెల్లగా కూడదీసుకుంటూ అన్నాను "ఉమ్మడి కుటుంబ గొప్పతనం మీకు అర్థం కాలేదు....."

"మనిషి మనిషికీ మధ్య అసూయలు అపోహలు అపార్థాలు తిష్ఠవేసుక్కూర్చున్నప్పుడు ఇలా కలిసి ఉండటం వల్ల ప్రయోజనమేమిటి? భౌతికంగా దగ్గరగా ఉండి మానసికంగా దూరమవడం ఎంత వరకూ సబబు? ఎంతవరకూ సమర్థనీయం?"

ఆమె వంక పిచ్చిగా చూశాను.

ఇదేవిటిలా ఎదురు దాడి చేస్తోంది? ఉమ్మడి కుటుంబ ఔన్నత్యాన్ని చిత్రీకరించడానికొచ్చి ఆ స్ఫూర్తికి తూట్లు పొడుస్తోందేవిటి? మాది నాటకమని గ్రహించేసిందా లేక....!

"మీరంతా ఉన్నామంటే ఉన్నామంటూ అంటీ అంటనట్లుగా ఉంటున్నారు. మీ

అందర్నీ కలిపే అంతసూత్రమేదో మిస్ అయినట్టనిపిస్తోంది. నిజం చెప్పాలంటే మీ మధ్య సంబంధాలు డొల్లగా ఉన్నాయి. ఎవరికి వాళ్ళు తమదే పైచెయ్యి కావాలనుకుంటున్నారు. మీ మధ్య ఉండాల్సిన సుహృద్భావం మచ్చుకి కూడా కన్పించట్లేదు. ఒక్క ముక్కలో చెప్పాలంటే మీ కుటుంబంలో అనుబంధం అనే ఆత్మపదార్థం పూర్తిగా లోపించింది...."

"మీరు చాలా ఘోరంగా మాట్లాడుతున్నారు" మొహం ఎర్రబడగా అన్నాను. మరొక్క ముక్క కక్కితే చెడామడా తిట్టెయ్యాలని డిసైడైపోయాను.

శృతి నవ్వింది.

నా ఒంటిమీద తేళ్ళూ జెర్రులూ ప్రాకాయి!

నుదురు చిట్లించి నిశితంగా చూశాను.

"మీది ఉమ్మడి కుటుంబం అని మీరంటున్నారు. కనీసం ఆ స్ఫూర్తి లేదే... అయిన వాళ్ళు ఒక్కరోజైనా కలిసున్నట్టు నటించలేకపోయారే అని నేననుకుంటున్నాను. ఉమ్మడి కుటుంబాలు కాస్తా న్యూక్లియర్ కుటుంబాలయ్యాయి. ఇక ముందు ముందు ఎవరికి వారే అవుతారేమో! రేపటి కుటుంబ వ్యవస్థని తలచుకుంటే దిగులేస్తోంది. పోనీండి. మీకు పెద్దవారెవరో ఉన్నార్టగా!"

"అమ్మ ఉంది" గబుక్కున నోట్లోంచి వచ్చేసింది.

"ఎక్కడా కన్పించరేం?"

"పల్లెలో ఉంటుంది..." అతి కష్టం మీద నోరు పెగల్చుకుని చెప్పేను.

"ఆమె మీ కుటుంబ సభ్యురాలు కాదన్నమాట! కనీసం నాటకంలోని ఒక పాత్రగా కూడా పనికి రాలేదన్నమాట! ఎంత ఘోరం!"

నాలిక్కరుచుకున్నాను.

అమ్మనెలా మర్చిపోయానో తెలీదు!

నుదురు కొట్టుకుని బేలగా చూశాను.

ఆమె నవ్వింది.

నా గురించి సర్వం తెలిసినట్టు నవ్వింది.

"మానవ సంబంధాలు ఇంత దారుణంగా దిగజారిపోయాయా!"

తలొంచుకున్నాను.

నా ముఖాన్ని అర్జంటుగా దాచేసుకోగల్గితే బావుణ్ణు !

"ప్యాకప్" అరిచింది శృతి.

**(రచన మాసపత్రిక ఏప్రిల్ 2014)**